సాక్షి జగిత్యాల

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



జగిత్యాలటౌన్:చింతకుంట చెరువులో వినాయకుల నిమజ్జనం

గణపయ్యా.. మళ్లీ రావయ్యా..

జగిత్యాలటౌన్:నవరాత్రులు భక్తుల పూజలు అందుకున్న గణనాథుడు సోమవారం గంగమ్మ ఒడికి చేరాడు. జగిత్యాల పట్టణంలో దాదాపు 700పైగా గణనాథులను ఏర్పాటు చేయగా.. మొదటి రోజు సోమవారం 200వరకు వినాయకులను నిమజ్జనం చేశారు. విద్యానగర్, విజయపురి, చిలుకవాడ, అరవింద్‌నగర్, హౌజింగ్‌బోర్డు, భాగ్యనగర్ తదితర కాలనీల నుంచి గణనాథులను శోభాయాత్రగా పాతబస్టాండ్, యావర్‌రోడ్, కొత్తబస్టాండ్, టవర్ మీదుగా చింతకుంట చెరువులో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు. చెరువు వద్ద బల్దియా అధికారులు భారీ లైటింగ్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జగిత్యాలటౌన్: టవర్‌సర్కిల్ వద్ద వినాయకుల శోభాయాత్ర, పాల్గొన్న భక్తులు



జగిత్యాలటౌన్: టవర్‌సర్కిల్ వద్ద శోభాయాత్రలో మహిళల కోలాటం



జగిత్యాలటౌన్: శోభాయాత్రలో వీహెచ్‌పీ నాయకులు



రాయికల్: మంగళహారతులతో ఆర్యవైశ్యమహిళలు



రాయికల్: పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మెట్‌పల్లి: నిమజ్జనోత్సవాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



మెట్‌పల్లి:శోభాయాత్రలో పాల్గొన్న పద్మశాలీలు



జగిత్యాలక్రైం: జగిత్యాలలో బందోబస్తులో పాల్గొన్న ఎస్పీ అశోక్‌కుమార్

న్యూస్‌రీల్

‘ప్రజాపాలన’ వేడుకలకు ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: ప్రజాపాలన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఏర్పాట్లపై ఆయన సోమవారం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 17న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఎగురవేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాతీయగీతం ఆలపన, తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ముఖ్య అతిథి అయిన విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ పథకాలపై ప్రసంగిస్తారని తెలిపారు. ఉద్యోగులు హాజరై ప్రొటోకాల్ పాటించడంతోపాటు వివిధ పనులు చూసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో సెక్రటరీలు జెండా ఎగురవేయాలని కోరారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతంరెడ్డి, ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, డీఎస్పీ రఘుచందర్ తదితరులు ఉన్నారు.

ముక్కిపోయిన అటుకులు..ఉడకని అన్నం



ఆందోళన చేస్తున్న రోగుల బంధువులు



లక్క పురుగులు



ముక్కిపోయిన అటుకులు

- మాతాశిశు సంరక్షణ కేంద్రంలో నాసిరకం ఆహారం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రోగులు

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి ఇతర జిల్లాల నుంచి గర్భిణులు చాలా మంది వస్తుంటారు. ఇక్కడ నెలకు సుమారు 300పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇందులో రోగులు, వారి బంధువులకు ఇవ్వాల్సిన ఆహారం మాత్రం నాసిరకంగా ఇస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి ఉదయం అల్పాహారం.. మధ్యాహ్నం భోజనం, రాత్రిపూట భోజనం ఇస్తుంటారు. అయితే ముక్కిపోయిన అటుకులు, ఉడికీ ఉడకని అన్నం పెట్టడంతో రోగులు, బంధువులు అస్వస్థతకు గురవుతున్నారు. తాజాగా సోమవారం మాతాశిశు కేంద్రంలో ఉదయంపూట అల్పాహారం కింద అటుకులు పంపిణీ చేశారు. అవి సరిగా ఉడకపోగా లక్క పురుగులు కనిపించాయి. వాటిని తిన్నవారు కొందరు అస్వస్థతకు గురయ్యారు. మరికొందరు ముక్కిపోయిన వాసన రావడంతో పారబోశారు.

పట్టించుకోని అధికారులు

ఉడికీఉడకని అన్నంతోపాటు నాసిరకం అటుకులు పెడుతున్నారని అక్కడున్న వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ‘ఎవరికి చెప్పుకుంటారో.. చెప్పుకోండి’ అని దురుసుగా ప్రవర్తించారని రోగుల బంధువులు ఆరోపించారు. నిత్యం ఇలాగే పెడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఆహారం తింటే వాంతులు, వీరోచనాలు అవుతున్నాయని తెలిపారు. ఒకవైపు అపరిశుభ్రతతో విషజ్వారాలు విజృంభిస్తుండగా.. ఇలాంటి నాసిరకంగా భోజనం పెడుతుండడంతో మరిన్ని రోగాల పాలవుతున్నట్లు వాపోతున్నారు.

తయారీ ఇక్కడ.. పంపిణీ అక్కడ

జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న జనరల్ ఆసుపత్రిలోనే రోగులకు వంట చేస్తుంటారు. ఇందుకు ఓ గదిని కూడా కేటాయించారు. ఏజెన్సీ తీసుకున్న కాంట్రాక్టర్ అక్కడ రోగుల కోసం వంట చేసుకుని అక్కడే ఉన్న రోగులతోపాటు ధరూర్ సమీపంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి ఆహారం సరఫరా చేస్తుంటాడు. అలా కాకుండా మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోనే ఓ గదిని కేటాయించి ఆహారం వండించే ఏర్పాట్లు చేయాలని రోగులు కోరుతున్నారు.

విచారణ చేస్తున్నాం

అటుకుల్లో లక్కపురుగులు వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేస్తున్నాం. రోగులకు నాణ్యమైన ఆహారం అందించేలా చూస్తాం.

– రాములు, ఆసుపత్రి సూపరింటెండెంట్

పల్లెల పరిశుభ్రతే లక్ష్యంగా..

- నేటి నుంచి స్వచ్ఛత హీ సేవా
- అక్టోబర్ 2వరకు కార్యక్రమాలు
- నిధులలేమితో భారమంటున్న అధికారులు

పెగడపల్లి: పల్లెల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 (గాంధీ జయంతి) వరకు స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా పేరిట కార్యక్రమాలు చేపట్టనుంది. 80 గ్రామ పంచాయితీల్లో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లా అధికారులు పల్లెల్లోని ప్రత్యేక అధికారులకు పలు సూచనలు చేశారు. పాలకవర్గాలు లేకపోవడం.. నిధులు లేకపోవడంతో కార్యదర్శులు, ప్రత్యేక అధికారులకు తలనొప్పిగా మారింది. ఇప్పటికే పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా ఇతరత్రా పనులే అధికారులకు భారంగా మారాయి. తాజాగా స్వచ్ఛతాహీ సేవా నిర్వహణను అధికారులే చూడాల్సి రావడంతో అప్పు చేయాల్సి వస్తుందేమోనని కార్యదర్శులు పేర్కొంటున్నారు.

కార్యక్రమాలు ఇలా..



పెగడపల్లిలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

- 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్య ఆరోగ్య సంరక్షణ, సేవలు
- 18న స్వచ్ఛత పరుగులు, సైక్లాథాన్‌లు, బీచింగ్, దోమల నివారణ మందుల పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్ర పరచడం,
- 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ, డంపుల గుర్తింపు, పథకాలతో అనుసంధానం
- 20న ప్లాంటేషన్ డ్రైవ్
- 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రతపై డ్రైవ్, పార్కుల శుభ్రపర్చడం, పీపీఈ కిట్‌లు, సేఫ్టీగార్డ్స్ పంపిణీ
- 22, మిషన్ లైఫ్ ప్రచారాలు, కాలువలు, డ్రైనేజీలను శుభ్రపరచడం, పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు
- 23న నీటి నిల్వపై అవగాహన, దారులశుభ్రత
- 24న తాగునీటి శుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారాలు, నీటి నమూనాల పరీక్ష, సపాయి మిత్రలు, కుటుంబాలకు అవగాహన
- 25న వీధి నాటకాలు, మార్కెట్ల శుభ్రం
- 26న అవాంచిత యాప్‌ల క్లియర్, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, పిల్లల సంరక్షణ
- 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ స్థలాల సుందరీకణ, స్ట్రీట్‌క్లీనింగ్ డ్రైవ్‌లు
- 28న సాలిడ్ వేస్ట్‌మెనేజ్‌మెంట్ ఆస్తుల సుందరీకరణ, పుట్‌పాత్‌లు, ఇ-వ్యర్థాల సేకరణ
- 29న ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన
- 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, విద్యాపబ్లిక్ ప్రదర్శనలు, కమ్యూనిటీ బెస్ట్, వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్యబీమా నమోదులో సహకారం
- అక్టోబర్ ఒకటిన విద్యాసంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు.
- చివరి రోజైన అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామ పంచాయతీల్లో సభలు ఏర్పాటు చేసి గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, మంచినీటి పథకాలు, ప్లాస్టిక్ నిషేధం, ఇంకుడు గుంతల నిర్మాణం తదితర అంశాలపై అవగాహన.

విజయవంతం చేస్తాం



స్వచ్ఛతాహీసేవా పేరిట చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేస్తాం. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా అధికారుల సూచన మేరకు పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులకు తెలియజేశాం. మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి ఎంపీడీవో, పెగడపల్లి

- భూమి కోసం.. భుక్తి కోసం బందూక్ చేతపట్టి
- నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన బిడ్డలు
- అమరుల త్యాగ ఫలమే సెప్టెంబర్ 17

బాంచెన్ కాల్మొక్తా దొరా అన్నవారే భూమి కోసం, భుక్తి కోసం బందూక్ పట్టి తిరగబడిన నేల ఇది. నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న తెలంగాణ ప్రజల విముక్తి కోసం ఉమ్మడి జిల్లా ముద్దుబిడ్డలు ప్రాణాలు వదిలారు. రజాకార్లను తరిమికొట్టారు. నిజాంకు వ్యతిరేకంగా సాగినపోరులో జిల్లా ప్రజలు సాయుధ గెరిల్లాలుగా, నాయకులుగా అగ్రభాగాన నిలిచారు. అజరామరమైన అమరుల బలిదాన ఫలితమే నేటి సెప్టెంబర్ 17. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో సాయుధపోరాటంపై స్టోరీ




గాలిపెల్లిలోని బద్దం ఎల్లారెడ్డి, కాంతమ్మ స్తూపాలు

బద్దం ఎల్లారెడ్డి(ఫైల్)

తిరగబడ్డ నేల..



ఉద్యమించిన సాయుధ దళం(ఫైల్)



గాలిపెల్లిలో అమరులైన పేర్లతో శిలాఫలకం

అమరులపల్లె గాలిపెల్లి

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లికి పోరాట చరిత్ర ఉంది. ఈ గ్రామానికి చెందిన కమ్యూనిస్టు యోధుడు బద్దం ఎల్లారెడ్డి నిజాం వ్యతిరేక పోరాటాన్ని సాగించాడు. వెట్టిచాకిరీ, బానిసత్వానికి నిరసనగా నిజాం పోలీసులు, రజాకార్లపై ప్రజలు తిరగబడిన గాలిపెల్లిలో బీకర పోరు సాగింది. ఆ పోరులో గాలిపల్లితోపాటు సమీప గ్రామాలకు చెందిన 11 మంది ఒకే రోజు అమరులయ్యారు. ఉద్యమంతో సంబంధం లేని గాలిపెల్లికి చెందిన వృద్ధ దంపతులు పెరంబుదూరి అనంతయ్య, రంగమ్మ బలయ్యారు.

స్ఫూర్తి ప్రదాత.. ఎల్లారెడ్డి

గాలిపెల్లికి చెందిన బద్దం హన్మంతరెడ్డి–లచ్చవ్వ రెండో సంతానంగా 1906లో జన్మించిన బద్దం ఎల్లారెడ్డి వెట్టిచాకిరి విముక్తి కోసం సాయుధ పోరాటాన్ని సాగించారు. 1948 మార్చి 12న ఇల్లంతకుంట పోలీసు క్యాంపుపై దాడిచేసి ఎస్సైతో సహా ఆరుగురు పోలీసులను హతమార్చారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా మద్రాసులో అరెస్ట్ అయి 3 నెలల జైలుశిక్ష అనుభవించారు. 1951లో జరిగిన తొలి ఎన్నికల్లోనే పీడీఎఫ్ అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి విజయం సాధించారు. 1958లో బుగ్గారం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. రెండోసారి 1972లో ఇందుర్తి నుంచి ఎమ్మెల్యే అయ్యారు. 1979లో తుది శ్వాస విడిచారు.

చాందా క్యాంపులో మంథనివాసులు



చాందా క్యాంపులో శిక్షణ పొందిన సమరయోధులు (ఫైల్)

మంథని: ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ రాష్ట్రాన్ని చేర్చాలని సాగిన పోరాటంలో మంథనికి చెందిన 10 మంది రెండేళ్లు అజ్ఞాతంలో ఉన్నారు. సుభాష్‌చంద్రబోస్ పోరాట స్ఫూర్తితో మహారాష్ట్రలోని చాందాలో శిక్షణ పొందారు. గులుకోట శ్రీరాములు ఆధ్వర్యంలో నడిచిన క్యాంపులో పనిచేశారు. మంథనికి చెందిన స్వాతంత్ర్య యోధుడు రాంపల్లి కిష్టయ్య ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన కూతురు వద్ద ఉంటున్నారు. ఇండియన్ యూనియన్ ఆధ్వర్యంలో గెరిల్లా, ఐఎన్‌ఏ శిక్షణపొంది పోలీస్‌స్టేషన్లు, నాకాలపై దాడులు, రోజుల తరబడి దట్టమైన అడవుల్లో తలదాచుకున్నారని కిష్టయ్య వివరించారు.

అరాచకంపై పోరుబాట



జోగినిపల్లి ఆనందరావు (ఫైల్)



కేశవరావుతో కేటీఆర్, కవిత

బోయినపల్లి(చొప్పదండి): నిజాం పాలనలో రజాకర్ల అరాచకాలపై పోరుబాట పట్టారు మండలంలోని కొదురుపాకకు చెందిన జోగినిపల్లి కేశవరావు, మాన్వాడకు చెందిన జోగినిపల్లి ఆనందరావు. ఖాసీం రజ్వీ సేనలు పల్లెల్లో చేస్తున్న అరాచకాలపై తిరుగుబావుటా ఎగురవేశారు. కేశవరావు మాజీ సీఎం కేసీఆర్‌కు మామ. 1920లో జన్మించారు. సాయుధపోరులో దళాలకు ఆయుధాలు సమకూర్చేవారు. మూడుసార్లు వరంగల్ జైలుకు వెళ్లారు. 2000 సంవత్సరంలో కాలం చేశారు. 1921లో జన్మించిన ఆనందరావు సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరులో చురుకుగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావుకు మేనమామ. 2009లో మృతిచెందారు. బోయినపల్లిలో చెన్నాడి కొండాల్‌రావు సైతం ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తింపు పొందారు. ఆనందరావు సీపీఐ నుంచి 1952 నుంచి 1957 వరకు సిరిసిల్ల ఎమ్మెల్యేగా, 1957 నుంచి 1962 వరకు మెట్‌పల్లి ఎమ్మెల్యేగా పనిచేశారు. అనంతరం మాన్వాడ సర్పంచ్‌గా 20 ఏళ్లు ప్రజా సేవ చేశారు.

నిజాంకు గుబులు పుట్టించిన ‘గట్టెపల్లి’



మురళీధర్‌రావు(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రజాకార్ల నిరంకుశ పాలనకు ఎదురొడ్డారు గట్టెపల్లి ముద్దుబిడ్డ మురళీధర్‌రావు. సుల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన మురళీధర్‌రావు 1943లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అనభేరి ప్రభాకర్‌రావుతో కలిసి రజకార్లపై ఎన్నో దాడులు నిర్వహించారు. హుస్నాబాద్ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గుట్టపై నుంచి దూకి తప్పించుకున్నాడు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు విమోచనం కలిగినా జమీందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాడు. 1988, జూన్ 2న మరణించారు.

సాయుధ పోరాటంలో కొన్ని ఘట్టాలు

- బద్దం ఎల్లారెడ్డి గ్రామం గాలిపెల్లిలో 1942లో పోలీసులు, రజాకార్లు దాడి చేసి పలు ఇళ్లను తగులబెట్టారు. అనేక మందిని కాల్చిచంపారు. అప్పట్లో ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.
- 1948 మార్చి 14న హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో అనభేరి ప్రభాకర్ సాయుధ దళ సభ్యులు అమరులయ్యారు.
- అప్పటి హోంమంత్రి వల్లభాయ్‌పటేల్ ఆదేశాల మేరకు హైదరాబాద్ రాష్ట్రాన్ని ముట్టడించి నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఆపరేషన్ పోలో జనరల్ చౌదరి నేతృత్వంలో జరిగింది. సెప్టెంబర్ 17న భారత సైన్యానికి నిజాం సైన్యం లొంగిపోయింది.
- ఖాసీంరజ్వీకి న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధించింది. 1957 సెప్టెంబర్ 17న పాకిస్తాన్‌కు వెళ్లిపోయాడు.
- హైదరాబాద్ సంస్థాన మిలటరీ గవర్నర్‌గా జనరల్ చౌదరి బాధ్యతలు స్వీకరించారు.

క్లుప్తంగా

మంటలు అంటుకుని వృద్ధురాలి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని పద్మానగర్‌కు చెందిన సింగం సుగుణ (80) గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ పేలి.. మంటలు అంటుకుని చికిత్స పొందుతూ మృతిచెందింది. సుగుణ ఈనెల 14న సాయంత్రం టీ పెడుతున్న సమయంలో సిలిండర్ రెగ్యులేటర్ పేలింది. ఆ మంటలు వ్యాపించి సుగుణకు అంటుకున్నాయి. కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి వేసి ఆమెను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందిస్తుండగానే మృతిచెందింది. మృతురాలి కుమారుడు సింగం భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

మునుల గుహను పరిశీలించిన ఈవో


మునుల గుహను పరిశీలిస్తున్న ఈవో

కరీంనగర్: కొండగట్టు అంజన్న ఆలయం నూతన కోనేరు పక్కనున్న మునుల గుహను ఈఓ రామకృష్ణారావు సోమవారం పరిశీలించారు. గుహచుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. భక్తులు మునుల గుహను దర్శించుకునేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పవిత్రమైన ఆ గుహను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

అంజన్న తలనీలాల టెండర్ మరోసారి వాయిదా

కరీంనగర్: కొండగట్టు అంజన్న ఆలయానికి సంబంధించిన తలనీలాల టెండర్ 11వ సారి వాయిదా పడింది. ఈనెల 30న హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయ ధ్యాన మందిరంలో మరోసారి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన టెండర్లలో సరైన ధర రాకపోవడంతో వాయిదా వేస్తూ వస్తున్నారు.

న్యాయం చేయండి

చందుర్తి(వేములవాడ): తన సోదరుడితో తలెత్తిన భూవివాదాన్ని పరిష్కరించాలంటూ ఓ రైతు సెల్‌టవర్ ఎక్కి ఆందోళన చేపట్టాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీసుస్టేషన్ ఎదుట సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని ఆశిరెడ్డిపల్లెకు చెందిన బొజ్జగట్టు పున్నాలు, మోహన్, మల్లయ్య అన్నదమ్ములు. మల్లయ్య గతంలోనే మృతిచెందాడు. అన్న పున్నాలు, తమ్ముడు మోహన్ మధ్య కొన్నేళ్లుగా వ్యవసాయబావి విషయంలో వివాదం ఉంది. వ్యవసాయ బావిలో అన్న పున్నాలుకు హక్కు లేదంటూ తమ్ముడు మోహన్ అభ్యంతరం తెలపడంతో పంచాయితీ మొదలైంది. గ్రామంలో పంచాయితీ పెట్టినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో పున్నాలు 15 రోజులుగా ఠాణా చుట్టూ తిరుగుతున్నాడు. పోలీసులు పట్టించుకోవడం లేదంటూ పున్నాలు సోమవారం ఠాణా ఎదుట గల సెల్‌టవర్ ఎక్కాడు. స్థానిక పోలీసులు చెప్పినా వినకపోవడంతో సీఐ వెంకటేశ్వర్లు వచ్చి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో టవర్ దిగి వచ్చాడు. పున్నాలుతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చి, ఇంటికి పంపించారు.


లడ్డూతో సంజీవరావు, వనజ దంపతులు


గణేష్ లడ్డూతో లవంగ రంజిత్ దంపతులు

లడ్డూ అ'ధర'హో..

జగిత్యాలటౌన్: గణేశుడి లడ్డూలకు నిర్వహించిన వేలంలో అధరహో అనిపించాయి. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మంటపంలో వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను ఎండపల్లి మండలం అంబారిపేటకు చెందిన అన్నమనేని సంజీవరావు, వనజ దంపతులు రూ.1,73,000కు వేలంలో దక్కించుకున్నారు. శ్రీలక్ష్మీగణేష్ మందిరంలోని గణనాథుని లడ్డూకు వేలం వేయగా లవంగ రంజిత్ దంపతులు రూ.1,34,116కు దక్కించుకున్నారు. వైశ్యభవన్‌లోని గణపతి లడ్డూను ఎలిమిల్ల మల్లికార్జున్, సంగెం భూమయ్య రూ.70,011కు వేలంలో దక్కించుకున్నారు.


లడ్డూతో మల్లికార్జున్, భూమయ్య దంపతులు

నేడు కోరుట్లలో నిమజ్జనం


బతుకమ్మ వాగులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమీషనర్ తిరుపతి

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో గణేశ్ నిమజ్జనోత్సవానికి మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని బతుకమ్మవాగు, కంచెరకుంట, యెఖీన్‌పూర్ పెద్ద వాగు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. రహదారులపై గుంతలు తాత్కాలికంగా పూడ్చివేశారు. నిమజ్జన ప్రాంతంలో బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

బహుమతులు ప్రదానం

సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోకి గణపతులన్నీ చేరుకునేలా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని గణపతులూ చేరుకున్నాక అలంకరణ, సందేశాత్మకం, పలు విభాగాల్లో ఉత్తమ గణపతి విగ్రహాలను గుర్తించి పోలీసు, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం కేటాయించిన నంబర్ల ప్రకారం వరుస క్రమంలో శోభాయాత్ర నిర్వహిస్తారు.

రూట్ మ్యాప్..

జూనియర్ కళాశాల మైదానం నుంచి గోదాంరోడ్, పాత బస్టాండ్, కార్గిల్‌చౌక్ ద్వారా గాంధీ రోడ్, సూపర్ బజార్‌రోడ్, కాల్వగడ్డ, గడిబురుజులు, అక్కడి నుంచి అంబేడ్కర్ రోడ్ ద్వారా బతుకమ్మ వాగులోకి చేరుకుని నిమజ్జనం చేస్తారు. వాహనాలకు కేటాయించిన నంబర్ల ప్రకారం శోభాయాత్రగా వెళ్లి గణనాథులను నిమజ్జనం చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి



గణపతుల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. రోడ్లకు తాత్కాలిక మరమ్మతు చేశాం. విద్యుత్ తీగలు సరి చేయించాం. నిమజ్జనం ప్రాంతంలో లైటింగ్, బారికేడ్లు, క్రేన్‌లు ఏర్పాటు చేశాం.
– తిరుపతి, మున్సిపల్ కమిషనర్

ప్రశాంతంగా జరుపుకోవాలి




గణేశ్ నిమజ్జనానికి బందోబస్తు ఏర్పాటు చేస్తాం. భక్తులు శాంతియుతంగా నిమజ్జనం జరుపుకోవాలి. అల్లర్లకు తావివ్వొద్దు. ప్రతి గణపతి వాహనాన్ని వీడియో చిత్రీకరిస్తాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.
– సురేశ్‌బాబు, సీఐ కోరుట్ల

'మీ అబ్బాయిని గంజాయి కేసులో పట్టుకున్నాం..'

- డబ్బులు పంపిస్తే విడిచిపెడతాం..
- పోలీస్ అధికారి ప్రొఫైల్ ఫొటోతో కాల్
- రూ.14వేలు ఫోన్‌పేలో పంపిన బాధితుడు


పోలీస్ అధికారి ఫొటోతో వచ్చిన నంబరు


ఫోన్‌పేలో పంపిన డబ్బులు

మేడిపల్లి: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాడు మోసం చేశాడు. రూ.14వేలు ఫోన్‌పేలో పంపి మోసపోయాడు. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొడుకు హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాడు. సోమవారం ఉదయం సదరు వ్యక్తికి పోలీస్ అధికారి ప్రొఫైల్ ఫొటోతో కాల్ చేసి 'మీ అబ్బాయిని గంజాయి కేసులో పట్టుకున్నాం. మీరు హైదరాబాద్ రావాలి..' అని చెప్పడంతో అవాక్కయ్యాడు. కొడుకు పేరుతో సహా వివరాలు పక్కాగా చెప్పడంతో పాటు 'మీ కొడుకుతో ఫోన్‌లో మాట్లాడండి..' అని చెప్పగా.. అక్కడ ఏడుపులు వినిపించాయి. 'ముగ్గురిపై కేసు నమోదు చేశాం.. మీ కొడుకుపై కేసు వద్దంటే రూ.35వేలు ఇచ్చి తీసుకెళ్లండి..' అని నమ్మించారు. దీంతో తన వద్ద అంత డబ్బులేదని, కేవలం రూ.14వేలు మాత్రమే ఉన్నాయని బాధితుడు చెప్పగా.. ప్రస్తుతానికి ఆ డబ్బులు ఫోన్‌పేలో పంపాలని సూచించారు. మిగిలిన డబ్బులు స్టేషన్ నుంచి తీసుకెళ్లేటప్పుడు ఇవ్వండి..' అని చెప్పి ఫోన్ పెట్టేశారు. దీంతో బాధితుడు సదరు వ్యక్తి చెప్పిన నంబర్‌కు ఫోన్‌పే ద్వారా పంపించాడు. తనకు కాల్ వచ్చిన నంబరు, ఫోన్‌పే నంబర్ వేరేగా ఉండడంతో అనుమానం వచ్చిన బాధితుడు తన కొడుకుకు ఫోన్ చేశాడు. తాను ఇంట్లోనే ఉన్నానని చెప్పడంతో కంగుతిన్న బాధితుడు మేడిపల్లి ఎస్సై శ్యాంరాజ్‌కు ఫిర్యాదు చేశారు.

'ట్రినిటి'లో ఫ్రెషర్స్ డే


విద్యార్థుల నృత్యం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని ట్రినిటి బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం శుభంగార్డెన్‌లో ఘనంగా జరిగాయి. కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఉన్నతమైన స్థానాన్ని చేరడానికి క్రమశిక్షణ, విద్యాప్రణాళికలతోపాటు మనస్సును ఉల్లాసపర్చడానికి ఇలాంటి ఫ్రెషర్స్ డే వేడుకలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, ట్రినిటి ఏసీ కళాశాల, ట్రినిటి ప్రైమ్ అకాడమీ, ట్రినిటి భగతనగర్, ట్రినిటి మెయిన్ క్యాంపస్ విద్యార్థినులు పాల్గొన్నారు.

లో లెవల్ కల్వర్టులు.. ప్రయాణానికి ఇక్కట్లు


తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ కల్వర్టు

కథలాపూర్: గ్రామాల శివారులో ఉన్న లోలెవల్ కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. వర్షాలు కురిస్తే వరద ఉధృతంగా పారడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఏటా వర్షకాలం పల్లె ప్రజలకు ఇవే కష్టాలు ఎదురవుతున్నా.. పరిష్కారంపై పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. ప్రధాన రోడ్లపై తక్కువ ఎత్తులో ఉన్న కల్వర్టుల స్థానంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కథలాపూర్‌లో సమస్య ఉన్న లోలెవల్ కల్వర్టులు..

- కోరుట్ల– వేములవాడ రూట్‌లో సిరికొండ శివారు ఆయిల్ ఒర్రె వద్ద
- ఇప్పపల్లి శివారులో ఎల్లమ్మ ఒర్రె వద్ద
- తాండ్ర్యాల గ్రామశివారులో రెండు వైపులా కల్వర్టుల వద్ద వాగు ఉధృతంగా పారుతుంది. కల్వర్టు పైనుంచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.
- దూలూర్– బొమ్మెన గ్రామాల మధ్య దూలూర్ శివారులో వాగు వద్ద కల్వర్టుపై నుంచి ఉధృతంగా పారితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అవుతున్నాయి.
- పెగ్గెర్ల శివారులో ఊర చెరువు మత్తడి దూకి రోడ్డుపై పారడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- ఇప్పపల్లి – పోతారం గ్రామాల మధ్య.. అంబారిపేట– తుర్తి గ్రామాల మధ్య కల్వర్టులను ఎత్తు పెంచితే రాకపోకలకు ఇబ్బంది ఉండదని ప్రజలు అంటున్నారు. – లోలెవల్ కల్వర్టులను హై లెవల్ కల్వర్టులుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వరద ఉధృతితో ప్రమాదాలు



వర్షకాలంలో లోలెవల్ కల్వర్టుల వద్ద వరద ఉధృతితో ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర సమయాల్లో గ్రామాలు దాటలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. గంభీర్‌పూర్ గ్రామస్తులు కోరుట్లకు వెళ్లాలంటే సుమారు నాలుగు కల్వర్టులు దాటాల్సి ఉంది.
– గండి తిరుపతి, గంభీర్‌పూర్

నివేదికలు పంపించాం

మండలంలో ప్రధాన రోడ్లపై ఉన్న లోలెవల్ కల్వర్టులతో వర్షాకాలం రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్యలున్న లోలెవల్ కల్వర్టులను పరిశీలించాం. వాటిని హైలెవల్ వంతెనలుగా మార్చడానికి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం.
– వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ డీఈ, మెట్‌పల్లి

నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలోని ఆరోతరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 23 వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఈనెల 16తో అయిపోయిన గడువును మరో వారంపాటు పెంచినట్లు చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరంలో సీబీఎస్‌ఈ విధానంలో ఆరోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు తేదీని పొడిగించినందున ఉమ్మడి జిల్లా పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరిస్తా



ఎన్‌రోల్‌మెంట్ పత్రాలు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల కోసమే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీలో ఉంటున్నానని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో పలువురు పట్టభద్రులకు ఎన్‌రోల్‌మెంట్ పత్రాలు అందించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ ఎన్నికల్లో గెలిచి విద్యావంతులైన యువత, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాష్ట్ర యోగా చాంపియన్ 'కరీంనగర్'

- అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లా జట్టు


పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కరీంనగర్‌కల్చరల్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 14,15వ తేదీల్లో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి యోగాసనా క్రీడా పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు 116 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్పు కైవసం చేసుకున్నట్లు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అత్యున్నత ప్రతిభ కనబరిచి 7 బంగారు, 4 రజత, 4 కాంస్య పతకాలు సాధించారు. అలాగే నాలుగు, ఐదు, ఆరో స్థానాల్లో కూడా మరో ఆరుగురు క్రీడాకారులు కప్పును కైవసం చేసుకునేందుకు సత్తాచాటారని పేర్కొన్నారు. జిల్లా నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా 16 మంది క్రీడాకారులు రాష్ట్ర జట్టు తరపున అక్టోబర్‌లో జరిగే జాతీయస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు వివరించారు. చాంపియన్‌షిప్ సాధించిన జిల్లా జట్టును డీవైఎస్‌వో శ్రీనివాస్, యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, కోచ్‌లు రామకృష్ణ, కిష్టయ్య, మల్లేశ్వరి, స్వరూప, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల యోగా అసోసియేషన్ కార్యదర్శులు మనోజ్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

మంథని ఆలయాల్లో మాజీ క్రికెటర్ వెంకటపతిరాజు పూజలు


మంథనిలోని ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ క్రికెటర్ వెంకటపతి రాజు దంపతులు

మంథని: మాజీ క్రికెటర్ వెంకటపతిరాజు దంపతులు సోమవారం పెద్దపల్లి జిల్లా మంథనిలోని పలు ఆలయాలను దర్శించుకున్నారు. తొలుత ప్రాచీన శ్రీభిక్షేశ్వరస్వామి, ఓంకారేశ్వరస్వామి, మహాలక్ష్మీ, శ్రీశ్రీలేశ్వర, సిద్దేశ్వర, శ్రీగౌతమేశ్వర, సీతారామ,శ్రీ బాలసరస్వతీ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రాచీన ఆలయాలతో మంథనిలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందని వెంకటపతిరాజు అన్నారు. ఇక్కడి దేవాలయాలకు ఎంతో పేరుందని, పురాతన ఆలయాలను దర్శించుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. ప్రముఖ స్పోర్ట్స్ జర్నలిస్టులు, క్రికెట్ కామెంటర్లు మహావాది సుధీర్, విజయ్‌కుమార్ మాతృమూర్తి సరోజనీదేవి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబసభ్యులను వెంకటపతిరాజు పరామర్శించారు. మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ తదితరులు ఉన్నారు.

వెదురు దినోత్సవ ర్యాలీ విజయవంతం చేయండి


- మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు మదిర రవీందర్


రవీందర్

జమ్మికుంట(హుజూరాబాద్): కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రపంచ వెదురు దినోత్సవం వేడుకలు, ర్యాలీని విజయవంతం చేయాలని మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు మదిర రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18న గీతాభవన్ చౌరస్తా నుంచి ప్రారంభమై కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామని అన్నారు. జిల్లాలోని కుల బాంధవులు పాల్గొనాలని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వలిపిరెడ్డి లచ్చయ్య, సహాయ కార్యదర్శి సిలువేరు సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకుల రాజనర్సు, కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు ఏకుల రమేశ్, ప్రధాన కార్యదర్శి వాసం సర్వేశం, మధిర గంగాధర్, పిట్టల కనకయ్య, రేపాల వీరస్వామి, ప్రభాకర్, బాలయ్య, వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ప్రతిభకు 'ఉపకారం'

- 'ఎన్‌ఎంఎంఎస్'తో భరోసా
- నవంబర్ 24న రాతపరీక్ష
- ఎంపికైతే ఏటా రూ.12 వేల స్కాలర్‌షిప్



ఎన్‌ఎంఎంఎస్ లోగో

మల్లాపూర్:చదువుకు పేదరికం ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. ఎనిమిదో తరగతిలో డ్రాపౌట్స్‌ను నివారించేందుకు ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)తో ప్రోత్సహిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏటా రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తోంది.

ఇవీ అర్హతలు

జిల్లా పరిషత్, మోడల్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల వరకు ఉండాలి. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతూ.. ఏడో తరగతిలో జనరల్, బీసీ కులానికి చెందిన వారు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించిన వారు మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హులు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలి. ఆన్‌లైన్‌లో http//br-e.teanfana.gov.in ఎస్‌బీఐ కలెక్టర్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలి.

నవంబర్ 24న రాతపరీక్ష..

ఎన్‌ఎంఎంఎస్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో విద్యార్థులకు వచ్చే నవంబర్ 24న రాత పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషల్లో పరీక్ష ఉంటుంది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

పరీక్ష విధానం..

'ఎన్‌ఎంఎంఎస్' పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుంది. ఒకటి మెంటల్ ఎబిలిటీ (ఎంఏటీ), రెండోది అప్టిట్యూట్ టెస్ట్ (ఎస్‌ఏటీ). ఇందులో ఏడు, 8వ తరగతి పాఠ్యపుస్తకాల్లోని సైన్స్, గణితం, సామాజిక అధ్యయనాల విభాగాల్లో 90 మార్కులు చొప్పున మొత్తం 180 మార్కులు ఉంటాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు ఇస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష ఉంటుంది. కనీస అర్హత మార్కులు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం కటాఫ్‌గా నిర్ణయించారు. ఎంపిక సమయంలో రిజర్వేషన్ నిబంధనలు పాటిస్తారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పథకాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిస్తే నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేల చొప్పున అందిస్తారు.
– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

మానేటిపై అరుణకిరణాలు..



బోయినపల్లి: మిడ్‌మానేరు ప్రాజెక్టు డౌన్‌స్ట్రీమ్‌లో మల్లాపూర్ మానేరు వాగు అందాలు సాయంత్రం కనువిందు చేస్తున్నాయి. మానేరువాగులో ఓ వైపు అస్తమిస్తున్న సూర్యుడి ప్రతిబింబం పారుతున్న నీటిలో కనిపించడంతో కనువిందు చేస్తోంది. సోమవారం సాయంత్రం వినాయక నిమజ్జనం వేళ మల్లాపూర్ వాగులో ఈ దృశ్యం ఆకట్టుకుంది.